బాధిత కుటుంబానికి పరామర్శ

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్ఆర్ రెడ్డి

మరికల్, ఆగస్టు 11: మండలంలోని బీఆర్ఎస్ నాయకుడు గౌని విష్ణుకాంత్‌రెడ్డి కుమారుడు గౌనిరామకృష్ణారెడ్డి వారం కిందట మృతిచెందాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం పులస్‌పాడ్‌లో విష్ణుకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. రామకృష్ణారెడ్డి మరణం తీరనిలోటన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు మతీన్, మరికల్ మాజీ సర్పంచ్ గోవర్ధన్, మండల అధ్యక్షుడు తిరుపతయ్య, నాయకులు బసంత్, అశోక్‌కుమార్, సత్యారెడ్డి, ఆంజనేయులు, గాదం మల్లేశ్ పాల్గొన్నారు.

మొగల్‌మడ్కలో..

దామరగిద్ద, ఆగస్టు 11: మండలంలోని మొగల్‌మడ్క గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గతవారం మహారాష్ట్రలోని పూణే సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలియడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ కిషన్‌రావు, మాజీ సర్పంచ్ మహిపాల్ ఉన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్, ఆగస్టు 11: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లబ్ధిదారులకు తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలానికి చెందిన వడ్డే శివకు రూ.60వేలు, రాజు రూ.42వేలు, రఘు రూ.21వేలు, జ్యోతి రూ.7,500, ప్రభావతి రూ.52వేలు మంజూరయ్యాయని తెలిపారు. సీఎం సహాయనిధికి అర్జీ పెట్టుకున్న ప్రతిఒక్కరికీ సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మండలాధ్యక్షుడు పరమేశ్వర్, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఫీ, రాఘవేందర్‌గౌడ్, షబ్బీర్, రాజశేఖర్, కాజా, ఇమ్రాన్ ఉన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- కుంగుతున్న సంగంబండ కుడికాల్వ కల్వర్టు

నేరడగం సమీపంలో లోలెవెల్ కెనాల్ మట్టితో వేసిన కల్వర్టుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సు

సంగంబండ రైట్ లోలెవెల్ కెనాల్ కాల్వలో కుంగుతున్న కల్వర్ట్ మట్టి

మాగనూరు, ఆగస్టు 11: మండలంలోని నేరడగం గ్రామ సమీపంలో ఉన్న సంగంబండ రిజర్వాయర్ రైట్ లో లెవెల్ కెనాల్ కాల్వ కల్వర్టు రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. మక్తల్ నియోజకవర్గం నుంచి మాగనూరు మండల పరిధిలోని ఉజ్జిలి, నేరడగం, దొడ్డి, బైరంపల్లి కర్ణాటక రాష్ట్రానికి ప్రధాన రహదారి అని స్థానికులు తెలిపారు. నేరడగం సమీపంలోని సంగంబండ రిజర్వాయర్ రైట్ లో లెవెల్ కెనాల్ కాల్వకు పైపులు వేసి, మట్టితో కల్వర్టు నిర్మించి వదిలేయడంతో అది ప్రస్తుతం వర్షం కురిసినప్పుడు, కెనాల్ కాల్వకు నీళ్లు వదిలినప్పుడు చాలా ప్రమాదకర స్థాయికి చేరుతుందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో నిత్యం వందల వాహనాలు తిరుగుతాయని, గతంలో కూడా ఓసారి ఈ కల్వర్ట్‌కు మధ్యలో కుంగిపోతే మరమ్మతులు చేసి వదిలేశారని గ్రామస్తులు తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే తగిన చర్యలు తీసుకుని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెద్దగుట్ట దారిలో సీసీ కెమెరాల ఏర్పాటు

సీసీ కెమెరాలను ఆన్‌చేస్తున్న జడ్చర్ల సీఐ

జడ్చర్ల, ఆగస్టు 11: జడ్చర్ల మున్సిపాలిటీలోని రంగనాయక స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుపై ఆదివారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి ఏర్పాటు చేయించారు. ఆలూర్ రోడ్డు నుంచి పెద్దగుట్టపైకి రోడ్డు పొడవునా ఏర్పాటు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్ కంట్రోల్ రూంకు లింక్ చేశారు. సీసీ కెమెరాలను జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ప్రారంభించారు. అనంతరం రాంరెడ్డిని సీఐతో పాటు, పట్టణవాసులు అభినందించారు. కార్యక్రమంలో రాంరెడ్డి సతీమణి రాధిక, విక్కి, రాఘవేందర్ ఉన్నారు.

ఎస్సైకి సన్మానం

ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ఊట్కూర్, ఆగస్టు 11: ఊట్కూర్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణం రాజును ఆదివారం వల్లంపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు తమవంతు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హన్మంతు, రాజు పాల్గొన్నారు.

నేడు మక్తల్ బంద్

మక్తల్, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న నరమేధాన్ని నిరసిస్తూ సోమవారం మక్తల్ బంద్‌కు పిలుపునిచ్చామని హిందూ ఐక్యవేదిక సభ్యులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మక్తల్ బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బంద్‌లో పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు.

మోసపూరిత వ్యవహారాలను గుర్తించాలి

నారాయణపేట, ఆగస్టు 11: సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత వ్యవహారాలను ప్రజలు గుర్తించి, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో లోన్ యాప్స్ ద్వారా రుణాలు తీసుకోరాదని, తీసుకున్న వారు వేధింపులకు గురైతే క్షణికావేశాలకు గురికాకుండా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు.

మున్సిపల్ కార్మికుల మానవహారం

జడ్చర్లలో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

జడ్చర్ల, ఆగస్టు 11: తమ సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు 7 వ రోజుకు చేరాయి. ఆదివారం జడ్చర్లలోని నేతాజీచౌక్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఇప్పటికైనా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 16వ తేదీ నుంచి సమ్మె చేయనున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ పట్టణకమిటీ ఉపాధ్యక్షురాలు యాదమ్మ, అంజమ్మ, యాదయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణాధ్యక్షుడు మహేశ్, కేశవులు తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ ప్రతులు ఇంటింటికీ ఇవ్వాలి

మక్తల్, ఆగస్టు 11: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇంటింటికీ రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేయాలని సీపీఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి కొండన్న అన్నారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సీపీఐ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 77ఏండ్లు గడుస్తున్నా దేశంలోని పేదలు, బడుగు బలహీనవర్గాలకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగఫలాలు నేటికీ సమగ్రంగా అందడంలేదన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఊరకుంట పోచమ్మ ఆలయ కమిటీ ఎన్నిక

ఆలయ కమిటీ సభ్యులతో గ్రామ పెద్దమనుషులు

అధ్యక్షుడు విక్కి

జడ్చర్ల, ఆగస్టు 11: జడ్చర్ల మున్సిపాలిటీలోని పాతబజార్ ఊరకుంట పోచమ్మ ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పోచమ్మ ఆలయ ఆవరణలో పాతబజార్‌కు చెందిన పెద్దలు, నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆలయ బోనాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విక్కి, ఉపాధ్యక్షుడిగా గుడ్ల రాము, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా శ్రీనివాస్, రాఘవేందర్, కార్యనిర్వాహక సభ్యులుగా శిరీశ్, దయాకర్, గణేశ్‌ను ఎన్నుకున్నారు. ఈనెల 27న ఊరకుంట పోచమ్మ దేవతకు బోనాలు పండుగ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 7వ వార్డు కౌన్సిలర్ ఉమాదేవివెంకటేశ్, నర్సిములు, మురళి, సత్యం, కుమార్, వార్ల జంగయ్య, కృష్ణయ్య, రఘు ఉన్నారు.

ప్రభుత్వ సంపదను దోచుకోవడమే ప్రజాపాలనా?

- ఇసుక దందా.. అక్రమ వసూళ్లు
- వంత పాడుతున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు
- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొబిగెలి శ్రీనివాస్

మాగనూరులో మాట్లాడుతున్న బొబ్బిలి శ్రీనివాస్

మాగనూరు ఆగస్టు 11: ప్రజాపాలన పేరుతో అధికార పార్టీ నాయకులు అక్రమ ఇసుక దందాలకు పాల్పడుతూ, ప్రభుత్వ సంపదను దోచుకుంటున్నారని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు మాగనూరు, వర్కూరు వాగులో నుంచి అక్రమ ఇసుక తరలిస్తూ కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ, పోలీసు అధికారులు సహకరిస్తున్నారని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇటుక బట్టీల యజమానులతో వసూళ్లు చేస్తూ, మక్తల్ పట్టణంలో ప్రభుత్వ, వక్ఫ్ బోర్డు భూములను సైతం ఆక్రమించి వెంచర్లు వేసి విక్రయిస్తున్నారని త్వరలోనే అధికారపార్టీ నాయకుల బాగోతాలు ప్రజల ముందు పెడతామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చెప్తున్న ఇందిరమ్మ, ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండారి చంద్రశేఖర్, మక్తల్ అసెంబ్లీ అధ్యక్షుడు గువ్వల తిరుపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి పాలెం వెంకటయ్య, మాగనూర్ మండల అధ్యక్షుడు సగరం రమేశ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు, నీలారెడ్డి, అనిల్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ ప్రతిభా పురస్కారాలు

మరికల్, ఆగస్టు 11: నాయీబ్రాహ్మణ విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికిగానూ ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదో తరగతి, డిగ్రీలో 9జీపీఏ నుంచి 10 జీపీఏ సాధించిన, ఇంటర్‌లో 900కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులు అందజేస్తామన్నారు. ఈనెల 20 లోపు విద్యార్థులు తమ సర్టిఫికెట్ జిరాక్స్‌లను జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులకు అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్‌నెంబర్ 9985441221, 9381543395, 9989985552లను సంప్రదించాలని కోరారు.

19న పద్మశాలీ విద్యార్థులకు..

పాలమూరు, ఆగస్టు 11: పదో తరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్, నీట్‌లలో అత్యంత ప్రతిభ కనబర్చిన పద్మశాలి విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రతిభా పురస్కారాలను ఈనెల 19న రాఖీ పౌర్ణమి రోజున అందజేస్తున్న తెలంగాణ పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్ తెలిపారు. పదిలో 10జీపీఏ, ఇంటర్‌లో 900కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు తమ ర్యాంకులను సెల్ నెంబర్ 9032844017కు ఈనెల 15వ తేదీలోపు పంపించాలని సూచించారు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి

- హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నారాయణపేట, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణ మారణ కాండను ఆపేందుకు అక్కడి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ మ్యాడం ప్రభాకర్, వీహెచ్‌పీ అధ్యక్షుడు సర్సిములు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండకు నిరసనగా ఆదివారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాష్ రోడ్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రఘువీర్ యాదవ్, శ్రీనివాస్, క్యాతన్‌రఘునాథ్, మెలగిరి కాంబ్లే, వెంకట్రాములు, ప్రవీణ్, వీహెచ్‌పీ, హిందూ వాహిని, ఏబీవీపీ, బీజేవైఎం, బీకేఎస్, వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన యజుర్వేద గాయత్రీ మహాయజ్ఞం

ఆర్యసమాజం దయానంద విద్యామందిర్‌లో యజ్ఞం చేస్తున్న భక్తులు

జడ్చర్ల, ఆగస్టు 11: జడ్చర్ల మున్సిపాలిటీలోని ఆర్యసమాజం దయానంద విద్యామందిర్‌లో త్రిదివసీయ శ్రావణి సందర్భంగా నిర్వహించిన యజుర్వేద గాయత్రీ మహాయజ్ఞం ఆదివారంతో ముగిసింది. మూడురోజుల పాటు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రహ్మానంద సరస్వతి, రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మహాయజ్ఞంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గాయత్రీ మహాయజ్ఞం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో గుబ్బనర్సింహులు, బక్క రాజేశ్వర్, బోడ్ల విజయకుమార్, కృష్ణయ్య, విజయలక్ష్మి, వీణా శివకుమార్, వేణుగోపాల్ ఉన్నారు.

బస్‌షెల్టర్ కూల్చివేత

- మాదారం గ్రామస్తుల ఆగ్రహం

నేలమట్టమైన బస్‌షెల్టర్

హన్వాడ, ఆగస్టు 11: మండలంలోని మాదారం గ్రామం గేటు వద్ద బస్‌షెల్టర్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో కూల్చివేశారు. కొన్నేండ్ల కిందట ప్రయాణికుల కోసం నిర్మించిన షెల్టర్‌ను రాత్రివేళ జేసీబీతో కూల్చారు. ఈ విషయం తెలియడంతో గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు వెళ్లి పరిశీలించారు. కూల్చిన వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల కార్యాలయం ఎందుట ధర్నా చేస్తామన్నారు. ఈ ఘటనపై గ్రామ కార్యదర్శిని సంప్రదించగా కూల్చిన విషయం తనకు తెలిసిందని, రేపు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని అన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

మరికల్ : ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

మరికల్, ఆగస్టు 11: బాధిత కుటుంబానికి యువత చేయూతనిచ్చింది. మరికల్ మండలంలోని ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన లచ్చనోళ్ల ఆంజనేయులు ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందాడు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న ఆంజనేయులు కుటుంబానికి అండగా నిలవాలని గ్రామంలోని యువత చేయి చేయి కలిపి రూ.25,500 సేకరించి బాధితుడి తల్లికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు యువతను అభినందించారు.

నవాబ్‌పేట మండలంలో..

నవాబ్‌పేట, ఆగస్టు 11: మండలంలోని కారుకొండ ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు, వారి స్నేహితుడు రాజుకు అండగా నిలిచారు. మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ మదిర రేవల్లికి చెందిన ముర్గని రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అతడి బాల్యస్నేహితులు తమవంతు సాయంగా రూ.40వేలు పోగుచేసి, రేవల్లిలోని అతడి ఇంటికి వెళ్లి ఆర్థికసాయం అందజేశారు. ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్నేహితునికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు.

ఇండ్ల వద్ద కనీస వసతులు కల్పించాలి

- కావేరమ్మపేట

డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఆందోళన

ఇండ్ల వద్ద వసతులు కల్పించాలని కోరుతున్న లబ్ధిదారులు

జడ్చర్ల, ఆగస్టు 11: మున్సిపాలిటీలోని కావేరమ్మపేట వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆందోళనకు దిగారు. ఇండ్లు పూర్తయి ఏడాది గడిచినా నేటికీ మౌలిక వసతులు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కిరాయి ఇండ్లలో ఉంటూ అద్దె కట్టుకోలేక పోతున్నామని, వసతులు కల్పిస్తే వెంటనే ఇండ్లలోకి చేరతామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

జడ్చర్ల, ఆగస్టు 11: జడ్చర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను ఆదివారం పట్టుకున్నట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. అడ్డాకల్ మండలం నుంచి జడ్చర్లకు అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను జడ్చర్ల ఫ్లైవర్ దగ్గర పట్టుకుని సీజ్ చేసి, కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్ల, ఆగస్టు 11: జడ్చర్ల మున్సిపాలిటీలోని ఎంబీ చర్చి దగ్గర ఆదివారం డీసీఎం వాహనం ఢీకొని సమీర్ అనే వ్యక్తి మృతిచెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీ రాఘవేంద్రనగర్‌కు చెందిన సమీర్ రాంగ్‌రూట్‌లో వెళుతూ అటుగా వస్తున్న మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టి కింద పడిపోయాడు. ఈ క్రమంలో కిందపడినది గమనించక అటుగా వస్తున్న డీసీఎం వ్యాన్ కంట్రోల్ కాక కిందపడిపోయిన సమీర్‌పై నుంచి వెళ్లింది. దీంతో సమీర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సమీర్‌ను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

యువకుల పాదయాత్ర

మరికల్, ఆగస్టు 11: మరికల్ నుంచి కోయిల్‌కొండకు యువకులు పాదయాత్ర చేశారు. ఆదివారం హన్‌మన్‌వాడ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారని యువకులు తెలిపారు. ఏటా శ్రావణమాసంలో మరికల్ నుంచి కోయిల్‌కొండకు పాదయాత్ర చేసి వీరభద్రస్వామిని దర్శించుకొంటామన్నారు. 16వ సారి పాదయత్ర చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో యువకులు సురేశ్, వెంకటేశ్, శ్రీనివాసులు, మహిందర్, రమేశ్, నవీన్, రాజశేఖర్, చంద్రశేఖర్, రఘు, నరేశ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

విజయవంతమైన వైద్య విజ్ఞాన సదస్సు

నారాయణపేట టౌన్, ఆగస్టు 11: పట్టణంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో పేట నియోజకవర్గ గ్రామీణ వైద్య సేవకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణంలోని ధన్వంతరి హాస్పిటల్ వైద్యులు శ్రీకాంత్, పరమేశ్‌నాయుడు, రాఘవేంద్ర, మహేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు విష జ్వాలు, బీపీ, షుగర్ వ్యాధులు, కీళ్ల నొప్పులు, నరాలు, అరికాళ్లు, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్ తదితర వ్యాధుల లక్షణాలు, ప్రథమ చికిత్స విధానాలను గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, జమీర్‌పాషా, ఖాసిం, నారాయణ, సత్యకుమార్, చింతలయ్య, నాగమణి, సబిత ఉన్నారు.

ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల
1994-95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

బేసిక్ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల
1978-79 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

ధన్వాడ : 2000-01 పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 11: మహబూబ్‌నగర్‌లోని బేసిక్ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల (బీపీహెచ్ఎస్) పదో తరగతి 1978-79 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో 46 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులుగా శ్రీధర్‌రావు, గంగాధర్, పుష్ప, శ్రీనివాస్ తదితరులు వ్యవహరించారు. చిన్ననాటి జ్ఞాపకాలు, చోటుచేసుకున్న ఘటనలు గుర్తు చేసుకుంటూ స్నేహితులతో సరదాగా గడిపారు.

మోడల్ బేసిక్ పాఠశాలలో..

ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ పదో తరగతి (బి-సెక్షన్) విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తమ చిన్ననాటి ఉపాధ్యాయులు మధుసూదన్, సిద్ధయ్య, వీణాదేవి, స్వర్ణలత తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఆ పాఠశాల హెచ్ఎం బాసిత్‌ఆలీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.భాస్కర్, ఆర్.వి.భాస్కర్, బి.శ్రీనివాసులు, ఏ.శ్రీనివాసులు, నాగరాజు, నగేశ్, టి.గంగాధర్, సుజాత పాల్గొన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ, ఆగస్టు 11: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు నాగరత్నమ్మ, నరేందర్, రతంగ్‌పాండురెడ్డి, విఠల్‌రావు, రామాచారి, దేవి, జయరాములును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఉన్నారు.

లారీ బోల్తా: డ్రైవర్ మృతి

భూత్పూర్, ఆగస్టు 11: మండలంలోని అన్నాసాగర్ శివారులో జాతీయ రహదారిపై శనివారం రాత్రి 12గంటల సమయంలో హైదరాబాద్ నుంచి హోసూర్(కర్ణాటక)కు వెళ్తుండగా కేఎంటీ లారీ(పార్శిల్) బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శివశంకర్(48) అక్కడికక్కడే మృతి చెందాడని మృతుని కుమారుడు రాజమోహన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు చిత్తూరు జిల్లా ఏర్పాడు వాసి అని, ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.